నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 25 డిసెంబర్ 2024 | HYDERABAD

తన నివాసంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులతో కలిసి సందడి చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

నగరంలో మంగళవారం ఉదయం నుంచి శిక్షణ పొందిన 39 మంది ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ విధుల్లో చేరారు. చిత్రంలో ఆలుగడ్డ బావి సిగ్నల్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న ట్రాన్స్‌జెండర్లు - సిటీబ్యూరో

ఆకాంక్ష నెరవేరేనా..?

నార్త్ సిటీ మెట్రో కోసం ఎదురుచూపులు

డిసెంబర్ 30న మంత్రివర్గ సమావేశం

క్యాబినెట్ ఎజెండాలో చేర్చకపోతే నార్త్ సిటీ మెట్రో లేనట్లే

ఒకవేళ సర్కారు ఆమోదిస్తే..కేంద్రానికి రివైజ్ డీపీఆర్

సిటీబ్యూరో, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : నార్త్ సిటీ మెట్రో విషయంలో డిసెంబర్ 30న జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశం కీలకంగా మారింది. ఇప్పటికే ఫేస్-2 మెట్రోకు రూపొందించిన డీపీఆర్‌ను ఆమోదించి, అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపింది. ఇందులో నార్త్ సిటీలోని రెండు ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్ ఉన్న ప్యారడైజ్-మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట ప్రాజెక్టులకు చోటు కల్పించలేదు. అయితే ప్రభుత్వం మరోసారి ఫేస్-2లో నార్త్ సిటీ మెట్రోపై పునరాలోచన చేస్తున్నది. అయితే ఈ నెలాఖరున జరిగే క్యాబినెట్ సమావేశంలో ఈ అంశానికి ఆమోదం తెలిపితే గానీ, రివైజ్ డీపీఆర్ విడుదలయ్యే అవకాశం లేదని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో మంత్రివర్గ సమావేశంలో మెట్రో విస్తరణలో నార్త్ సిటీ ప్రాంతాలను చేర్చుతారా.. లేదా అనేది తెలియాల్సి ఉంది.

తీరని అన్యాయం చేసేలా..

నగరంలో దాదాపు 76 కిలోమీటర్ల మేర పొడవైన మెట్రో మార్గాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఫేస్-2మెట్రో విస్తరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కానీ ఇందులో గడిచిన కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న నార్త్ సిటీని పరిగణనలోకి తీసుకోకుండానే ప్రణాళికలకు ఆమోదం తెలిపింది. దీంతో తమ ప్రాంతానికి తీరని అన్యాయం చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని స్థానికుల నుంచి విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలో స్థానికుల ఆందోళనలతో ఇటీవల మెట్రో ఫేస్-2పై ప్రభుత్వం పునరాలోచన చేస్తున్నట్లుగా తెలిసింది. అందులో నార్త్ సిటీని కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని సమాచారం బయటకు వచ్చింది. నిజంగా ప్రభుత్వం నార్త్ సిటీ ప్రాంతాలను ఫేస్-2లోనే నిర్మిస్తుందా అనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది.

కీలకంగా క్యాబినెట్ ఎజెండా..

మెట్రో ఫేస్-2లోనే నార్త్ సిటీ ప్రాంతాలైన ప్యారడైజ్-మేడ్చల్, జేబీఎస్ - శామీర్‌పేట మెట్రో విస్తరణ చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ రెండు అంశాలను క్యాబినెట్ మీటింగ్ ఎజెండాలో చేర్చి ఆమోదం తెలిపినప్పుడే ఆశలు సజీవంగా ఉన్నట్లు. కానీ ప్రభుత్వం ఈ అంశాన్ని అజెండాలో చేర్చకుండా నార్త్ సిటీని ఫేస్-2లోనే నిర్మిస్తామని మౌఖికంగా ప్రకటిస్తే మాత్రం పెద్ద ప్రయోజనం ఉండదని చెబుతున్నారు. ఈ క్రమంలో క్యాబినెట్ ఎజెండాలో నార్త్ సిటీ మెట్రో అంశం ఉండేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సి ఉంటుంది. టెక్నికల్‌గా క్యాబినెట్ ఆమోదిస్తేనే రివైజ్ డీపీఆర్‌కు ఆస్కారం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. కానీ ప్రభుత్వం క్యాబినెట్‌లో చర్చించకుండా నార్త్ సిటీ మెట్రోపై ప్రకటన చేస్తే... ఇక ఫేస్-2లో ఆ ప్రాంతాల్లో మెట్రో నిర్మాణం అసాధ్యమేనని చెబుతున్నారు.

తీర్మానాలు లేకుండానే పనులా?

అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు: ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, డిసెంబర్ 24: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో నిధులు లేకున్నా.. ముందస్తు పనులు ఎలా చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కమిషనర్ సరస్వతి, ఏఈ నర్సింహరాజు, వినిల్ గౌడ్‌ను ప్రశ్నించారు. 28వ డివిజన్ పరిధిలో ఉన్న సప్తగిరి కాలనీలో కమ్యూనిటీ హాల్ కోసం నిధులు మంజూరు చేసి.. సంవత్సరాలు గడిచి పోతున్నా ఎందుకు పట్టించు కోవడం లేదని ప్రశ్నించారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎలాంటి తీర్మానాలు, టెండర్లు లేకుండానే పనులు ఎలా చేయిస్తున్నారని కమిషనర్‌ను అడిగారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎక్కడ పనులు చేస్తున్నారో కమిషనర్‌కు తెలియపోతే ఎలా అని అడిగారు. అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

మూర్ఖంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ సర్కారు..

కాంగ్రెస్ ప్రభుత్వం మూర్ఖంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదని ఎమ్మెల్యే అన్నారు. గతంలో మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్, మాజీ మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చొరవతో మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.150 కోట్లు కేటాయించినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం నుంచి హెచ్ఎండీ నిధులు తీసుకొచ్చినట్లు చెప్పారు. బడంగ్‌పేటకు రూ.50కోట్లు, మీర్‌పేట కు రూ.50కోట్లు, జల్‌పల్లికి రూ.25 కోట్లు, తుక్కుగూడకు రూ. 25 కోట్లు రోడ్ల కోసం కేటాయించినట్లు వెల్లడించారు.

ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు..

గడిచిన సంవత్సర కాలంలో ఒక్క రూపాయి కూడా మున్సిపాలిటీలకు ఇవ్వలేదని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మంజూరు చేసిన ఎఫ్‌డీఎఫ్ నిధులను రద్దు చేయడం కాదు వెంటనే నిధులు ఇవ్వాలన్నారు. ప్రజలను పరిష్కారం చేయాలన్న చిత్త శుద్ధి ఉంటే నిధులు ఇవ్వాలన్నారు. గతంలో కేసీఆర్ అభివృద్ధి చేసిన పనులకు కాంగ్రెస్ సర్కారు ప్రారంభోత్సవాలు చేస్తున్నదని అన్నారు. గతంలో రోడ్ల కోసం రూ.1450 మంజూరు చేస్తే జీవో మార్చి శంకుస్థాపనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్బన్ మున్సిపాలిటీలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లను ఏర్పాటు చేయడానికి గత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మధ్యంతరంగా ఆగి పోయిన ఇంటిగ్రేటెడ్ పనుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సూర్ణ గంటి అర్జున్, పెద్ద బావి శ్రీనివాస్‌రెడ్డి, యాతం పవన్ కుమార్, ఏనుగు రాంరెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

గ్రేటర్‌లో మరో 40 చోట్ల చార్జింగ్ పాయింట్లు

ఇప్పటికే 43 ప్రాంతాల్లో అందుబాటులోకి..

సిటీబ్యూరో, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : బహిరంగ ప్రదేశాల్లో ఈ-వాహనాల కోసం చార్జింగ్ పాయింట్‌ల ఏర్పాటుకు జీహెచ్ఎంసీ కసరత్తు చేస్తున్నది. వాహన కాలుష్యాన్ని తగ్గించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నది. ఇందులో భాగంగానే ఎలక్ట్రిక్ వాహనదారులకు చార్జింగ్ సమస్య లేకుండా తక్కువ ధరతో ఈ-చార్జింగ్ కేంద్రాలను నగర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నారు.

ఈ చార్జింగ్ స్టేషన్ తక్కువ ధరతో తొందరగా చార్జింగ్ అయ్యేందుకు ఎక్కువ యూనిట్ యంత్రాలను అనువైన స్థలాన్ని ఎంపిక చేసి ఈ మేరకు గ్రేటర్ వ్యాప్తంగా రెడ్ కో సహకారంతో యూనిట్‌కు ఒక రూపాయి కమీషన్‌కు జీహెచ్ఎంసీ ఒప్పందం చేసుకుంది. గ్రేటర్‌లో ఈవీ కార్ల సంఖ్య దాదాపు 5వేల వరకు ఉన్నట్లు అంచనా వేసిన అధికారులు.. అందుకు అనుగుణంగా చార్జింగ్ పాయింట్లు పెంచుతున్నారు. ఇప్పటికే 43 ప్రాంతాల్లో అమలు అవుతుండగా, తాజాగా మరో 40 చోట్ల చార్జింగ్ పాయింట్లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు జీహెచ్ఎంసీ ఏర్పాట్లు చేస్తున్నది.

మొత్తం 150 ప్రాంతాల్లో..

గ్రేటర్‌లో 150 చోట్ల ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్ స్టేషన్‌ల ఏర్పాటుకు టీజీ రెడ్‌కో తో ఒక రూపాయి కమీషన్ చొప్పున బల్దియా ఆదాయ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నది. టీజీ రెడ్‌కో ఇప్పటి వరకు 83 ప్రాంతాల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్లకు ఇన్‌స్టాల్ చేసింది. వాటిలో 43 చార్జింగ్ స్టేషన్లు పలు ప్రాంతాల్లో కమీషన్ చేశారు. మిగిలిన మరో 40 చోట్ల కమీషన్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా జీహెచ్ఎంసీ పరిధిలో ఒక్క యూనిట్‌కు రూ.15.34 రూపాయలు కాగా, ప్రైవేట్ చార్జింగ్ స్టేషన్‌లో రూ.23.6ల నుంచి 35.4 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. జీహెచ్ఎంసీ పరిధిలో ఏర్పాటు చేసిన చార్జింగ్ స్టేషన్‌లు తక్కువ రేటుతో పాటు కేవలం 40 నిమిషాల్లో చార్జింగ్ ప్రక్రియ పూర్తవుతుంది. ఒక్కొక్క చార్జింగ్ స్టేషన్ 60 కిలో వాట్‌ల కెపాసిటీ కలిగి ఉంది. ఒక్కొక్క కారు కెపాసిటీ 20 యూనిట్లు కాగా 30 నిమిషాల్లో కారు చార్జింగ్ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. ఈ చార్జింగ్ వాహనాలకు చార్జింగ్ సమస్య ఉండకూడదనే ఉద్దేశంతో ఈ పాయింట్లు

ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా, బల్దియా సెంటర్ల వద్ద యూనిట్‌కు రూ. 13తో పాటు 18శాతం జీఎస్టీ కలిపి రూ. 15.34 వరకు, అదే ప్రైవేట్‌లో మాత్రం రూ. 20 నుంచి రూ.25ల వరకు (18 శాతం జీఎస్టీ అదనంతో) వసూలు చేస్తున్నారు.

కుట్టు కూలీ ఇయ్యలె..

సర్కారు పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలు కుట్టి ఇచ్చిన మహిళా సంఘాలు

అందని కుట్టు కూలీ డబ్బులు

ఆందోళన చెందుతున్న మహిళా సంఘాల సభ్యులు

మేడ్చల్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్‌లను కుట్టిన మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం ఇప్పటి వరకు కూలీ డబ్బులను అందజేయలేదు. దీంతో స్వయం సహాయక మహిళా సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. మేడ్చల్ జిల్లాలోని 507 ప్రభుత్వ పాఠశాలల్లో 89,605 మంది విద్యార్థులు చదువుతుండగా, ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు కావాల్సిన యూనిఫామ్‌లను కుట్టి అందజేయాలని మహిళా సంఘాలకు గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా ప్రభుత్వం ఆదేశించింది. అనుకున్న సమయానికే విద్యార్థులకు యూనిఫామ్‌లు కుట్టి అందించి ఏడు నెలలు గడిచినా.. తమకు రావాల్సిన రూ.88 లక్షల బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు మహిళా సంఘాలు సభ్యులు పేర్కొంటున్నారు. జిల్లాలోని 507 ప్రభుత్వ పాఠశాలలో 44,184 మంది బాలురు, 45, 340 బాలికలు ఉండగా, వారికి అవసరమయ్యే వస్త్రాలు(క్లాత్)ను ప్రభుత్వం అందించింది. మహిళా సంఘాల ద్వారా 23 కుట్టు సెంటర్లను ఏర్పాటు చేసి 1200 మంది మహిళలు తక్కువ ధరకు కుట్టేలా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ చర్యలు తీసుకున్నది. మొదటి విడతలో రూ.44 లక్షలు చెల్లించినప్పటికీ రెండో విడతలో మరో రూ.88 లక్షలు చెల్లిస్తామని చెప్పి ఏడు నెలలు పూర్తయినప్పటికీ ఇప్పటివరకు డబ్బులు అందలేదని మహిళా సంఘాల సభ్యులు ఆవేదన చెందుతున్నారు.

జాతీయ రైతు దినోత్సవం రోజే అన్నదాత అవయవదానం

ఖైరతాబాద్: జాతీయ రైతు దినోత్సవం రోజే ఓ రైతు అవయదానం స్ఫూర్తి నింపింది. జీవన్‌దాన్ నోడల్ అధికారి ప్రొఫెసర్ డాక్టర్ శ్రీభూషణ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబ్‌నగర్ జిల్లా అమనగల్ మండలం, ముద్విన్ గ్రామానికి చెందిన పుట్టి జంగయ్య (74) రైతు. ఈ నెల 19న ఇంట్లో ఒక్కసారిగా అపస్మారక స్థితిలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 23న బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు.. అవయవదానం విశిష్టను వివరించగా, అంగీకరించారు. జంగయ్య శరీరం నుంచి కాలేయం, రెండు మూత్రపిండాలు, కార్నియాలను సేకరించారు. అయితే జంగయ్య అవయదానం చేసిన రోజు సోమవారం జాతీయ రైతు దినోత్సవం ఉండగా, ఆయన అవయదానం పలువురి జీవితాలకు కొత్త వెలుగునిచ్చింది.

వార్షిక నివేదికను విడుదల చేస్తున్న సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి ఇతర అధికారులు

కాగితాలకే పరిమితం..

దుబాయ్ తరహా టూరిజం ఎక్కడ?

హుస్సేన్ సాగర్ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేలా రేవంత్ సర్కారు ప్రణాళికలు

పది నెలలుగా అమలు కాని నిర్ణయం

సిటీబ్యూరో: ట్యాంక్ బండ్ పరిసరాలను దుబాయ్ తరహా టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. హుస్సేన్ సాగర్ ప్రాంతాన్ని మొత్తం ఒక యూనిట్‌గా తీసుకుని టూరిజం వేదికగా మార్చాలని ఈ ఏడాది ఫిబ్రవరిలో అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పరిసరాల్లో అంబేద్కర్ విగ్రహం, స్మృతి వనం, కొత్త సెక్రటేరియట్, నెక్లెస్ రోడ్డు, పీవీ ఘాట్, అమ్యూజ్‌మెంట్ పార్క్, ఎన్‌టీఆర్ పార్క్, ఇందిరా పార్క్, సంజీవయ్య పార్క్, స్కై వాక్ వే వంటివి ఉన్నాయి. వీటికి అదనంగా మరి కొన్నింటితో ఆహ్లాదకరమైన వాతావరణంతో కూడిన టూరిజం కేంద్రంగా ఆధునీకరించాలన్నారు. దీనికి దుబాయ్ టూరిజాన్ని ప్రామాణికంగా తీసుకోవాలని ఆదేశించారు.

బీఆర్ఎస్ పాలనలోనే..

బీఆర్ఎస్ పాలనలోనే హుస్సేన్ సాగర్ పర్యాటకానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో భాగంగా స్కై వాక్ వే, చిల్డ్రన్ అమ్యూజ్‌మెంట్ పార్క్, సంజీవయ్య పార్క్ ఆధునీకరణ పనులు చేపట్టారు. అదే సమయంలో ట్యాంక్ బండ్ పరిసరాలను అందంగా తీర్చిదిద్దారు. కాగా, హుస్సేన్‌సాగర్ ప్రక్షాళన విషయాన్ని ఏడాది కాలంగా పక్కనపెట్టిన హెచ్ఎండీఏ.. ఆ దిశగా ఏమాత్రం ప్రయత్నం చేయడం లేదు. ఈ క్రమంలోసీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన నిర్ణయాలను అమల్లోకి తీసుకువచ్చేందుకు అధ్యయనం కూడా మొదలుపెట్టలేదు.

సందడి లేని ట్యాంక్ బండ్

ప్రస్తుతం ట్యాంక్ బండ్ పర్యాటకులకు బోర్ కొడుతున్నది. ఎలాంటి ప్రత్యేకతలు లేకపోవడంతో ఒకటి, రెండు సార్లు మించి విజిట్ చేయలేని పరిస్థితి. కేవలం పార్కులు, ట్యాంక్ బండ్ పరిసరాలను చూసేందుకు వీలు ఉండగా.. పర్యాటకులను హత్తుకునేంతగా ఏమీ లేవు. బీఆర్ఎస్ సర్కారు ట్యాంక్ బండ్ పరిసరాలను మోస్ట్ హ్యాపెనింగ్ జోన్‌గా తీర్చిదిద్దేందుకు వారాంతంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించింది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సండే ఫన్ డే ఆకట్టుకున్నది. ఇదే తరహాలో కార్యక్రమాలను చేపడితే... ట్యాంక్ బండ్‌కు మళ్లీ పర్యాటకుల సందడి మొదలైతుందని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు.

భారీగా పెరిగిన నేరాలు..

అత్యధికంగా సైబరాబాద్‌లో నమోదు

పెరిగిన శిక్షల శాతం

వార్షిక నివేదిక విడుదల చేసిన సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

సిటీబ్యూరో: హైదరాబాద్‌లో ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో భారీగా నేరాలు పెరిగాయి. హైదరాబాద్‌లో 41%, సైబరాబాద్‌లో 64%, రాచకొండలో 4 % నేరాలు పెరిగాయి. ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శాంతి భద్రతలు అదుపు తప్పుతున్నాయి. నేరాలు పెరిగాయి. ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో నేరాలు పెరుగుతుండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా ఆయా కమిషనరేట్ల పోలీసులు 2024 వార్షిక నివేదికను విడుదల చేశారు. ఇందులో నేరాలు పెరిగినట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. గత బీఆర్ఎస్ హయాంలో శాంతి భద్రతలకు పెద్దపీట వేసిన అప్పటి ప్రభుత్వం.. హైదరాబాద్‌లో నేరాలను ఎక్కడికక్కడే అడ్డుకట్ట వేసింది. పటిష్టమైన శాంతి భద్రతలతో సురక్షితమైన నగరంగా హైదరాబాద్ రూపుదిద్దుకున్నది. అయితే కాంగ్రెస్ సర్కారు వచ్చాక.. క్షేత్ర స్థాయిలో పోలీసింగ్ పూర్తిగా గాలికొదిలేశారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులన్నింటిపై కేసులు నమోదు చేయడంతోనే క్రైమ్ రేటు పెరిగిందనే వాదనను ఆయా పోలీస్ కమిషనర్లు వినిపిస్తున్నారు. సైబర్‌నేరాలు పెరుగుతున్నాయంటే అంగీకరించాల్సిందే. కానీ హత్యలు, లైంగిక దాడులు, దొంగతనాలు, ఆర్థిక నేరాలు అన్ని పెరగడం ప్రజలను తీవ్ర భయాందోళనలను కలిగిస్తున్నది.

సైబరాబాద్‌లో భారీగా పెరిగిన నేరాలు

మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి గచ్చిబౌలిలోని కమిషనరేట్ కార్యాలయంలో 2024 వార్షిక నివేదికను విడుదల చేశారు. సాధారణ నేరాల్లో 64 శాతం పెరుగదల కనిపించగా, సైబర్‌నేరాల్లో 164 శాతం పెరిగాయి. డ్రగ్స్ నియంత్రణపై ఉక్కుపాదం మోపుతున్నామని సీపీ వెల్లడించారు. ఇందులో భాగంగా భారీ ఎత్తున ఈ సారి డ్రగ్స్‌ను అడ్డుకున్నామని తెలిపారు. ప్రధానంగా గంజాయి, కొకైన్, ఓపీఎం, సింథటిక్ డ్రగ్‌ను పట్టుకున్నామని వెల్లడించారు. ఈ ఏడాది 2714 కిలోల గంజాయి స్వాధీనం చేసుకోగా, వాటి విలువ రూ. 24.92 కోట్లు ఉంటుందని తెలిపారు. పీడీఎస్ రైస్ పక్కదారి పట్టిస్తుండటంతో 135 కేసులు నమోదు చేసి రూ. 178 కోట్ల విలువైన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోయిన సెల్‌ఫోన్లకు సంబంధించి 69554 ఐఎంఈఐఎస్ బ్లాక్ చేసి 7967 సెల్‌ఫోన్లు బాధితులకు అందించినట్లు వివరించారు. నేరాల్లో శిక్షల శాతం గత ఏడాది 43.84 శాతం ఉండగా, ఈ ఏడాది 47.62 శాతం ఉందని సీపీ వివరించారు.

స్థానిక ఠాణాల్లోనే ఫిర్యాదు చేయొచ్చు

సైబరాబాద్‌లో వచ్చే ఏడాది నుంచి సైబర్ మోసాల్లో రూ. 1.5 లక్షల వరకు ఆర్థిక నష్టం జరిగితే స్థానిక పోలీస్‌స్టేషన్లలోనే కేసులు నమోదు చేస్తామని సీపీ అవినాశ్ మహంతి వెల్లడించారు. ఇప్పటి వరకు రూ. 50 వేలపై ఆర్థిక నష్టం జరిగితే సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసే వారని, సైబర్ క్రైమ్ ఠాణాపై భారం పడుతుండడంతో నష్ట పరిధిని పెంచుతున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాలు తగ్గాయని, చాలా చోట్ల రోడ్లు విస్తరణ చేయడంతో ప్రమాదాల్లో మరణాలు తగ్గాయని వివరించారు.

అతి కిరాతకంగా హత్య చేసి.. ప్లాస్టిక్ గోనె సంచిలో తీసుకొచ్చి..

మైలార్‌దేవ్‌పల్లి: ఓ వ్యక్తిని అతి కిరాతకంగా హత్య చేసి ప్లాస్టిక్ గోనె సంచిలో తీసుకొచ్చి... నిర్మానుష ప్రాంతంలో పడేశారు. ఈ సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గానగర్ చౌరస్తా నుంచి ఆరాంఘర్ చౌరస్తా వెళ్లే మార్గంలో పారిశుధ్య సిబ్బంది రోడ్డు ఊడ్చుతుండగా ఓ వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సుమారు 30-35 సంవత్సరాల వ్యక్తిని ఎక్కడో హత్య చేసి ప్లాస్టిక్ గోనె సంచిలో పెట్టి తీసుకొచ్చి ఇక్కడ పడేశారని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

బొల్లారం/బంజారాహిల్స్: ఆపరేషన్ రోప్ కార్యక్రమంలో భాగంగా ఫిలింనగర్ బస్తీల్లో మంగళవారం ఫుట్‌పాత్ ఆక్రమణలను ట్రాఫిక్ విభాగం, జీహెచ్ఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో తొలగించారు.సుమారు 30 షెడ్లు తొలగించారు. కంటోన్మెంట్ పరిధిలోని డైమండ్ పాయింట్ ప్రధానంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎదురుగా,ఇంపీరియల్ గార్డెన్ నుండి బోయిన్‌పల్లి మార్కెట్ వరకు ఇరువైపులా వెలిసిన ఫుట్‌పాత్,రోడ్డుకు ఇరువైపులా వెలిసిన అక్రమ కట్టడాలను తొలగించారు.